"**శారదా!** మా అబ్బాయికి ఉద్యోగం వచ్చింది!" స్కూలుకు రాగానే లక్ష్మి చెప్పింది.

శారద నవ్వుతూ, "కంగ్రాట్స్! అయినా మీ వాడికి రాకపోతే ఎవరికి వస్తుంది? ఇంజనీరింగ్ ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాడు కదా! ఇంతకీ ఉద్యోగం ఎక్కడ?" అనడిగింది.

"బెంగుళూరులో ... టాటా వారి కంపెనీ."

"ఇన్నాళ్లకి మీ కష్టాలు తీరాయి లక్ష్మీ! నాకెంతో ఆనందంగా ఉంది!"

"అవుననుకో ... కానీ ..." ఆలోచిస్తూ ఆగింది లక్ష్మి.

"కొడుక్కి ఉద్యోగం వచ్చిందని సంతోషించక, ఇంకా ఆ దిగులేమిటి?" అనడిగింది శారద.

"కిరణ్‌కి ఫారిన్ వెళ్లాలని ఉంది. వాడి ఫ్రెండ్సందరూ వెళ్లారు. వాడు వెళ్లలేకపోతున్నాడు. ఫారిన్ ఛాన్స్‌కోసం ప్రయత్నిస్తుంటే ఇప్పుడీ ఉద్యోగం వచ్చింది!" అంది విసుగ్గా.

శారద నవ్వేస్తూ, "ఫారిన్ పిచ్చి మీక్కూడా ఉందా?" అనడిగింది.

"పిచ్చా...?"

"లేకపోతే ఏమిటి? అబ్బాయికి మంచి ఉద్యోగం వస్తే సంతోషించక ఎక్కడో అందని ఆకాశాలకు నిచ్చెనలేస్తున్నారు!" అంది శారద.

"మేం ఉండగా, వాడికా బాధ లేదు. వాడు కోరింది ఏదైనా వాడికి సంపాదించి పెడతాం.... ఎంత కష్టమైనా సరే!"

"అయితే ఆకాశానికి నిచ్చెనలేస్తారన్నమాట!"

"తప్పకుండా. అందరూ వెళ్లగా లేనిది, నా కొడుకు ఫారిన్ ఎందుకు వెళ్లలేడు? ప్రయత్నిస్తాను ... తప్పకుండా సాధిస్తాను!" రోషంగా అంది లక్ష్మి.

శారద, ఎర్రబడ్డ లక్ష్మిముఖంలోకి చూసింది. కొడుక్కు ఫారిన్ ఛాన్స్ రాలేదని బాధపడుతోంది. కొడుకు ఇంజనీరింగ్ చదివినందుకు ఫారిన్ వెళ్లాలా? అదేమన్నా రూలా? ఇక్కడ మంచి ఉద్యోగం వస్తే చాలదా? లక్ష్మికి మెల్లగా నచ్చచెప్పి ఆమె మనస్సు మార్చాలి! అనుకుంది శారద.

ఇంతలో బెల్ మోగింది. క్లాసుకు వెళ్లే హడావుడిలో పడిపోయింది శారద.

ఆ రోజు రాత్రల్లా లక్ష్మికి ఎలా నచ్చచెప్పి మనసు మార్చాలా అని ఆలోచిస్తూ ఉండిపోయింది శారద.

మర్నాడు శారద స్కూలుకు రాగానే హెడ్ మిస్ట్రెస్ శారదని పిలిచింది.

"చూడు, శారదా! లక్ష్మి నాలుగురోజులు సెలవు పెట్టింది. ఆవిడ క్లాసుని నీ క్లాసుతో కలిపి చెప్పు!"



# వలస పక్షులు. విన్నకోట సుశీలాదేవి

అంది.

"నాలుగు రోజులు సెలవా! ఎందుకు?"

"ఆవిడ ఊరెళ్లిందిట ... ఇక వివరాలు తెలియవు!" అంది. హెచ్.ఎమ్.

'కొడుకు హైదరాబాద్‌లో కంప్యూటర్ కోర్సు నేర్చుకుంటున్నాడు. అక్కడికేమైనా వెళ్లిందేమో!' అనుకుంది శారద.

నాలుగు రోజుల తర్వాత లక్ష్మి వచ్చింది.

"ఏమిటీ ... చెప్పకుండా సెలవు పెట్టావు? మీ అబ్బాయి దగ్గరకెళ్లావా? ఉద్యోగస్తుడయ్యాడు కదా, మళ్లీ ఎన్నాళ్లకి వస్తాడో అనే బెంగ కలిగిందా ఏమిటి?" అనడిగింది శారద నవ్వుతూ.

"అదేం కాదు; వాడిని తీసుకుని చెన్నై వెళ్లాను."

"ఎందుకు?"

"ఫారిన్ ఛాన్స్‌కోసం. అమెరికన్ కౌన్సలేట్‌కి వెళ్లాం."

"ఏమైంది?"

"ఇంకా ఏం తెలలేదు. అప్లికేషన్ ఇచ్చివచ్చాం. చాలా కాంపిటీషన్ ఉంది. వచ్చేట్లు కనపడలేదు!" దిగులుగా అంది.

'రాకుండా ఉంటే బాగుండు' అనుకుంది శారద. ఎందుకో కిరణ్ ఫారిన్ వెళ్లడం తనకిష్టంగా లేదు. విదేశాలకు వెళ్లడం ఒక అంటుజ్వరంలా నేటి చదువుకున్న యువతలో వ్యాపించింది. కిరణ్ తెలివిగల వ్యక్తి. అతని ప్రతిభ, శక్తి ఈ దేశానికి ఉపయోగించాలి. అదీకాక, లక్ష్మి, ఆమె భర్త ఎంత కష్టపడి వాడిని చదివించారో తనకు తెలుసు. వారిద్దరి జీవితాలు వేరువేరు చోట్ల ఉద్యోగాల్లో గడచిపోయాయి. ఇద్దరివీ ప్రైవేటు స్కూళ్లు అవడంతో ఒకచోటకి ట్రాన్స్‌ఫర్ అయ్యే అవకాశం లేదు. పెద్దమ్మాయికి టెన్త్ పాసవగానే పెళ్లి చేశారు. ఒక్కగానొక్క కొడుకుని బాగా చదివించాలని తమలాగా చిన్న ఉద్యోగం చేయకూడదని తమ అవసరాలు కూడా తగ్గించుకుని, సుఖాల్ని త్యాగంచేసి ఎంత కష్టపడి డబ్బు కూడబెట్టారో తనకు తెలుసు. లక్ష్మి మెడలో మంగళసూత్రాలు తప్ప వేరే నగ లేదు. చీరలు కూడా అతి మామూలివి కొనుక్కునేది. ఎంత దూరమైనా నడిచి వెళ్లేది.

"ఎందుకు లక్ష్మి అంత కష్టపడుతున్నావ్?" అని ఎప్పుడైనా తను అడిగితే

"ఈ కష్టమంతా వాడికోసమేనే! ప్రతి పైసా కూడబెట్టి వాడిని బాగా చదివించాలి. వాడికి మంచి భవిష్యత్తు ఇవ్వాలి. అదే మా కోరిక, ఆరాటం, తపన ... అంతా వాడికోసమే!" అనేది లక్ష్మి.

తల్లిదండ్రుల కష్టాన్ని గమనించి కిరణ్ చక్కగా చదువుకునేవాడు. వేరే వ్యాపకాలు పెట్టుకోకుండా చదువుమీదే దృష్టి కేంద్రీకరించి అన్ని క్లాసుల్లో చక్కగా ఫస్టున పాసయ్యాడు. చివరకు ఎమ్‌సెట్‌లో మంచి రాంక్ తెచ్చుకుని ఇంజనీరింగ్‌లో సీటు సంపాదించాడు. ఇంజనీరింగ్ ఫస్ట్‌క్లాసులో పాసయ్యాడు. ఇప్పుడు మంచి ఉద్యోగం కూడా వచ్చింది. ఇంతవరకూ బాగానే ఉంది. కానీ ఆ తర్వాత పరిణామమే తనకు నచ్చలేదు అనుకుంది శారద.

వారం తర్వాత లక్ష్మి ఉత్సాహంగా వచ్చింది. "శారదా! మా అబ్బాయికి అమెరికాలోని యూనివర్సిటీలో ఎమ్.సి.ఏ. చదవడానికి సీటు వచ్చింది!" ఆనందాన్ని తట్టుకోలేకపోతోంది లక్ష్మి.

కానీ ఆ మాట వినగానే శారదకెందుకో దిగులు కలిగింది. శారద కళ్లముందు కిరణ్ మెదిలాడు.

సన్నగా, తెల్లగా, అందంగా ఉంటాడు కిరణ్. వాడినెక్కడో దేశం కాని దేశానికి పంపడం శారదకెందుకో ఇష్టంగా లేదు.

లక్ష్మి చెప్పుకుపోతోంది "శారదా! ఆ వార్త తెలియగానే కిరణ్ సంతోషంతో పొంగిపోయాడు.

## ఆకట్టుకుంటున్న సహారా టీవీ




ఆరు లక్షలమంది సభ్యులుగల ప్రభుత్వేతర సంస్థగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న సహారా ఇండియా పరివార్ ఈ సంవత్సరం మార్చి నెలలో సహారా టెలివిజన్ ఛానెల్‌ను ప్రారంభించింది. ప్రారంభమైన అతి కొద్దికాలంలోనే సహారా టీవీ వివిధ రకాల వినోద, విజ్ఞాన కార్యక్రమాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నదని డిప్యూటీ డైరెక్టర్ సుమిత్‌రాయ్ విలేకరుల సమావేశంలో చెప్పారు. సహారా ఇండియా పరివార్ 1978వ సంవత్సరంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని గోరఖ్‌పూర్‌లో ప్రారంభమైంది. ఇప్పటివరకూ ఈ సంస్థ గృహనిర్మాణం, విద్యారంగం, మాస్ కమ్యూనికేషన్స్, వినియోగ ఉత్పత్తుల రంగంలో కోట్లకొలది రూపాయల వ్యాపారం(పబ్లిక్ డిపాజిట్‌ల సహాయంతో) చేస్తోంది. వివిధరంగాలలో మంచిపేరు సంపాదించుకొన్నట్టే శాటిలైట్ టెలివిజన్ రంగంలోకూడా ప్రేక్షకులకు నచ్చే ఆనందభరితమైన, ఆలోచనాత్మకమైన కార్యక్రమాలను అందిస్తామని సుమిత్‌రాయ్ చెప్పారు.

-సి

వాడి ముఖం వెలిగిపోయిందనుకో! అమ్మయ్య! ఇన్నాళ్ళకు వాడి కోరిక తీరింది!" అంది లక్ష్మి.

తీరింది వాడి కోరిక కాదు, మీది! ... అనాలనిపించింది శారదకు. ఆపూట లక్ష్మి స్టాఫందరికీ పార్టీ ఇచ్చింది. అందరూ లక్ష్మి అదృష్టాన్ని పొగుడుతున్నారు.

"మీరు చాలా అదృష్టవంతులు, లక్ష్మీ! మీ అబ్బాయికి మంచి జీవితం ఇస్తున్నారు. అందరికీ ఇలా కలిసి రాదు కదా!"

తలొక మాటా అంటున్నారు.

విదేశాలకు వెళ్లి చదవటం అదృష్టమా?!

విదేశాలలో ఉద్యోగాలొస్తే గొప్పా? ... వాళ్ల మాటలు వింటుంటే శారదకు ఒళ్లు మండిపోయింది. ఉండబట్టలేక లేచి నిలబడింది. ఆవేశంగా మాట్లాడసాగింది

"పిల్లలకి మంచి జీవితం ఇస్తున్నామని పొరబడుతున్నారు. అమాయకమైన పిల్లల్ని బలిపసువుల్ని చేస్తున్నారు. మీ ఆశలకు, మీ గొప్పలకు పిల్లల్ని బాధపెడుతున్నారు. తల్లినీ, తండ్రినీ వదలి ఎక్కడో దేశంకాని దేశంలో నా అనే వాళ్లు లేని ప్రపంచంలో వాళ్లని అనాథలను చేస్తున్నారు. ఒంటరిగా వాళ్లెంత మానసిక వ్యథ అనుభవిస్తున్నారో మీకు తెలుసా? పువ్వుల్లాంటి పసివాళ్లను బండరాళ్లను చేస్తున్నారు. డబ్బు సంపాదనే వాళ్ల ధ్యేయంగా చేసి వాళ్లను డాలర్లు తయారుచేసే యంత్రాలుగా మారుస్తున్నారు. ఏ మమతలూ, అనుబంధాలూ లేని యాంత్రిక జీవితాలకు అలవాటుపడేలా చేస్తున్నారు. మీరు చేస్తున్న పని మంచిదో, కాదో మీరే ఆలోచించుకోండి!" అంటూ కూర్చుంది.

శారద మాటలు విని అక్కడి వాళ్లు ముఖాలు మాడ్చుకున్నారు.

"శారదా! నీకింత దేశభక్తి ఉన్నట్లు మా కిప్పటివరకూ తెలియదు!" అంది ఒక టీచరు వ్యంగ్యంగా.

"దేశభక్తి కాదు, పిల్లలపై ప్రేమ. పిల్లల్ని వదిలి ఉండలేని మమకారం!" అంది శారద.

"మాకీ ప్రేమలూ, మమకారాలూ లేవు. మేము బండరాళ్లం! సరేనా!" అంది మరొక టీచరు కోపంగా.

"బండరాళ్లో, బంగారు గనులో నాకు తెలియదు గానీ ... ఈ రోజుల్లో ప్రతి వ్యక్తికీ డబ్బే ప్రధానమైంది. అది సంపాదించే విధానంతో పని లేదు. ఆశల వెంట అంతం లేని పరుగు. దీని వలన ఏం సాధిస్తున్నారు? సుఖమా? ఆనందమా? అసలు సుఖానికి నిర్వచనం ఏది? డబ్బు శారీరక సుఖాన్నిస్తుందేమో గానీ, మానసిక శాంతినివ్వదు. ఆనందం, తృప్తి ధనం వలన లభిస్తాయనుకోవడం కేవలం భ్రమ. మనకు ప్రస్తుతం డబ్బే ముఖ్యమైపోయి మిగతా అన్ని విలువల్నీ వదులుకుంటున్నాం. భర్త ఒకచోట ఉద్యోగం, భార్య మొరకచోట, పిల్లలు హాస్టల్లో ... ఇదీ మన నేటి వ్యవస్థ! కుటుంబమంటే ఇదేనా? జంతువులు, పక్షులు కూడా అన్యోన్యంగా కలిసుంటున్నాయి. కానీ మనిషి ఉండలేకపోతున్నాడు!" ఆవేదనతో అంది శారద.

"శారదా! నీ ఆలోచనలు ఒక శతాబ్దం పాతవి. అందరూ ముందుకు పోతుంటే నువ్వు ఇంకా అనుబంధాలు, సెంటిమెంట్లూ అంటూ వేళ్లాడడం ఏమీ బాగాలేదే!" అందొక టీచరు.

"శారదా! మన పిల్లలు బాగా చదువుకుంటున్నారు. కానీ ఇక్కడ వాళ్ల చదువుకు తగిన ఉద్యోగాలేవీ? ఈ దేశంలో ఎంత అవినీతి! ఎన్ని రాజకీయాలున్నాయో ... నీకు తెలుసా?" అంది లక్ష్మి.

"అమెరికాలో మాత్రం అధర్మం, అన్యాయం లేవా? అక్కడ కూడా ఉద్యోగాలు, జీతాలు మనవాళ్లకొక విధంగా, ఆ దేశీయుల కొక విధంగా ఇస్తారట! అక్కడ మనవాళ్లకు జీతం తక్కువ, పనెక్కువ. డాలర్ని రూపాయల్లోకి మార్చుకుంటే ఎక్కువ కాబట్టి ఆకర్షణీయంగా ఉంటుంది కానీ, అక్కడ కూడా మనవాళ్లు ఎంత దోపిడీకి గురవుతున్నారో మీకు తెలియదు!" అంది శారద.

ఇంతలో బెల్ అవ్వడంతో అందరూ లేచారు.

"శారదా! నీతో వాదించడం కష్టం తల్లీ!" అంది లక్ష్మి.

"శారదా! ఇప్పుడిలా మాట్లాడుతున్నావు గానీ, అవకాశం వస్తే నీ పిల్లల్ని కూడా అమెరికా పంపిస్తావు. అప్పుడీ మాటలు గుర్తు చేస్తాంలే!" అన్నారు మిగతా టీచర్లు.

శారద మాట్లాడలేదు. లక్ష్మితో కలిసి బయటకి నడిచింది.

***

గేటు దాటాక అంది లక్ష్మి "శారదా! నాతో మా కిరణ్ కూడా వచ్చాడు!"

"అలాగా ... సాయంత్రం మా ఇంటికి రమ్మను, వాడిని చూసి చాలాకాలమైంది!" అంది శారద.

"వాడూ నిన్ను చూడాలని అనుకుంటున్నాడు. వాడితో వాడి ఫ్రెండు కూడా వచ్చాడు. ఇద్దరూ వస్తారు. కానీ నీ ఉపన్యాసాలతో వాళ్లని హడలగొట్టకు! కిరణ్ అసలే సెంటిమెంటల్ ఫూల్. నీ మాటలు వింటే అమెరికా ప్రయాణం మానుకుంటాడు."

"అబ్బే! వాడినేమీ అనను. వాడితో ఏమీ వాదించను, సరేనా?" నవ్వింది శారద.


ఇంటికొచ్చాక భర్తకు టీ ఇస్తూ అంది శారద "కిరణ్‌తో ఎన్నో చెప్పాలనుకున్నా. కానీ లక్ష్మి నన్ను కట్టేసింది!"

"ఉపోద్ఘాతం మాని, అసలు విషయం చెప్పు!" అన్నాడాయన టీ తాగుతూ.

"మా లక్ష్మి కొడుకు కిరణ్‌కి బెంగుళూరులో చక్కటి ఉద్యోగం వచ్చిందండీ. వాడినా ఉద్యోగంలో చేరిస్తే కొడుకు కళ్లముందు ఉంటాడు. లక్ష్మి, ఆమె భర్తా ఇన్నాళ్లూ వేరువేరు ఊళ్లల్లో ఉద్యోగాలు చేస్తూ ఎంతో అవస్థపడ్డారు. ఇప్పుడు లక్ష్మి ఉద్యోగం మానేసి భర్త దగ్గరకు వెళ్లిపోవచ్చు. ఈ మిగిలిన జీవితమైనా హాయిగా, ప్రశాంతంగా గడవచ్చు కదా! అసలు ఇద్దరూ ఉద్యోగాలు మానేసి, కొడుకు దగ్గరకు వెళ్లిపోవచ్చు. హాయిగా ముగ్గురూ కలిసి బతకమ్చు. ఇన్నాళ్లూ కొడుకుని హాస్టల్లో ఉంచింది. ఇపుడైనా వాడిని కళ్లముందు ఉంచుకోవచ్చు కదా! ఊహూ ... మళ్లీ కొడుకుని అమెరికాకు పంపుతోంది. అక్కడ చదువు అవ్వాలి, ఉద్యోగం రావాలి ... మళ్లీ మొదటికొచ్చింది వాళ్ల జీవితం! ఇంకెప్పుడు వాళ్లు సుఖపడతారో?!"

"అయిందా ఉపన్యాసం ... ఇంకా ఏమన్నా ఉందా?" శారద భర్త నవ్వాడు.

"ఉపన్యాసం కాదు, అది నా బాధ!"



"నువ్వు ఈ అనవసర విషయాల్లో తల దూర్చి, ఆలోచించి బాధపడటం ఏం బాగాలేదు, డియర్! ఆవిడ కొడుకు ఆవిడిష్టం!"

"అవుననుకోండి ..."

"ఇంకేం మాట్లాడకు, ప్రశాంతంగా ఉండు!"

"సరే! ఇంకాస్సేపట్లో కిరణ్, వాడి ఫ్రెండు వస్తారుట. ఏదన్నా టిఫిన్ చేస్తాను!" అంటూ లేచింది శారద.

***

"రాజా! అమెరికా గురించి పొగడటం అయిందా, ఇంకేమన్నా మిగిలుందా?" శారద కోపంగా అంది.

ప్లేటులో ఉన్న ఆఖరి పకోడీ నోట్లో వేసుకుని, "మీకు తెలియదు, ఆంటీ! ఆ రోడ్లు, ఆ బిల్డింగులు, అక్కడి వాతావరణం ... ఓహ్ ... ఒక్క మాటలో చెప్పాలంటే అది భూతల స్వర్గం! అటువంటి స్థితి మనకెప్పటికీ రాదు!" అన్నాడు రాజా.

కిరణ్ ఫ్రెండ్ రాజా మాటలు మరింత కోపాన్ని తెప్పించాయి శారదకు. ఆ క్షణంలో లక్ష్మి కిచ్చిన మాట మరిచిపోయింది. ఆవేశంతో విరుచుకుపడింది


"రాజా! నీ అభిప్రాయం తప్పు! ఒకప్పుడు భారతదేశం కూడా భూతలస్వర్గమే. ఆనాడు ఈ దేశాన్ని జీవితంలో ఒక్కసారైనా దర్శించాలని ప్రపంచదేశాలు తహతహలాడేవి. తర్వాత ఎన్నో ఏళ్ల విదేశీపాలనలో ఈ దేశం సర్వం కోల్పోయి బీదదేశమైపోయింది. అమెరికాకు స్వాతంత్ర్యం వచ్చి నాలుగు వందల సంవత్సరాలైంది. అందుకే ఈనాటికి ఎంతో అభివృద్ధి సాధించి, నువ్వన్నట్లు భూతలస్వర్గమైంది నేడు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి కేవలం యాభై సంవత్సరాలైంది. ఇప్పుడు ఈ దేశాన్ని ఎంతో అభివృద్ధి చేయాల్సి ఉంది. దానికోసం ... రాజా! నీ వంటి యువకులు శ్రమించాలి కానీ, అసహ్యించుకుని ఈ దేశం నుండి పారిపోకూడదు!" ఆవేశంగా అంది.

"టీచరు అనిపించుకున్నారు, ఆంటీ!" అన్నాడు రాజా నవ్వుతూ.

కిరణ్ శారదవైపు ఆరాధనగా చూస్తూ, "ఆంటీ! ఎంతో బాగా చెప్పావు. నువ్వు చెప్పింది నూటికి నూరుపాళ్లూ నిజం. మాలాంటి ఇంజనీర్లు ప్రస్తుతం దేశానికి ఎంతో అవసరం!" అన్నాడు.

"ఏం కిరణ్? ఆంటీ పిచ్చి నీకూ తలకెక్కిందా? మనం ఇంత కష్టపడి చదివాం. కానీ ఈ దేశంలో మనకు తగిన ఉద్యోగాలున్నాయా? ఇక్కడ ఉంటే మనం అడుక్కు తినాల్సిందే! ఈ అవినీతి ... లంచగొండితనం ..... ఇక్కడి రాజకీయాలూ ... వీటిమధ్య అసలు మనం బతగ్గలమా?" అన్నాడు రాజా.

"అదే తప్పు, రాజా! మీలాంటి యువకులు




వీటిని ఎదుర్కొని నిలబడాలి. ఇల్లు బాగాలేకపోతే బాగుచేసుకుంటాం గానీ, వదిలిపోతామా?" అంది శారద.

"అవును, ఆంటీ! మా తాతగారు కూడా ఇలాగే అనేవారు!"

"ఏమని కిరణ్?"

"ఆయనకు పల్లెటూర్లో ఇల్లు ఉండేదిట. తనకు ఉద్యోగం వచ్చాక ఆ ఇల్లు బాగుచేయించాలనుకున్నారు. కానీ, కుదరక ఇల్లే వదిలిపెట్టాల్సి వచ్చిందట. ఆయన మళ్లీ స్వంత ఇల్లే కట్టుకోలేకపోయారు. దేశం వదలిపోతున్న యువకుల్ని గురించి చెప్తూ, 'నువ్వయినా ఇండియాలో ఉండి, మంచి ఇల్లు కట్టి, మీ అమ్మా నాన్నని సుఖపెట్టరా!' అనేవారు!"

"మరి నువ్వు మంచి ఉద్యోగం కూడా వదులుకుని విదేశాలకు వెడుతున్నావు కదా!" అంది శారద.

"మా తాతగారు ఇప్పుడు ఉంటే నన్ను వెళ్లనిచ్చేవారు కాదు, ఆంటీ!"

"కనీసం ఆయన కోరికైనా తీర్చవచ్చు కదా!"

"చనిపోయినవారి కోరికకంటే, బతికున్నవాళ్ల కోరిక తీర్చడం ముఖ్యం కదా!" అంటూ నవ్వాడు కిరణ్.

శారదకు అర్థమైంది. ఇంకేం మాట్లాడలేదు.

"ఆంటీ! అమ్మా, నాన్నా ఇప్పటివరకూ నాకోసం ఎంతో కష్టపడ్డారు. ఆ విషయం నాకు తెలుసు. చదువైంది, ఉద్యోగం వచ్చింది. ఇక వాళ్లను సుఖపెట్టాలనుకున్నాను. కానీ మళ్లీ ఇప్పుడు చదువంటే ... ఎప్పుడు తేల్తానో!?" నిట్టూర్చాడు.

కిరణ్‌ని చూస్తుంటే ఎంతో ముచ్చటేసింది శారదకు. ఇంత బాధ్యతగా మాట్లాడే పిల్లలు ఈ కాలంలో అసలున్నారా? తల్లిదండ్రుల్ని పీడించి డబ్బు తీసుకుని ఫారిన్ ఎగిరిపోయే పిల్లలే కానీ, తల్లిదండ్రుల కష్టాల్ని అర్థం చేసుకుని అండగా నిలవాలనుకునే వాళ్లేరీ? ఇంత మంచి కొడుకుని కన్న లక్ష్మి ధన్యురాలు! కానీ, తన ఆశలకు వాడిని బలిపెడుతోంది. అదే బాధగా ఉంది అనుకుంది శారద.

కొద్దిసేపు కూర్చుని వాళ్లిద్దరూ వెళ్లిపోయారు.

***

"కిరణ్ అమెరికా వెళ్లాలంటే నాలుగు లక్షలు బాంక్ డిపాజిట్ చూపించాలట!" అంది లక్ష్మి మర్నాడు శారదతో.

శారద ఆశ్చర్యపోతూ, "నాలుగు లక్షలే! ఎక్కడనుండి తెస్తారు?" అంది.

"అదే ఆలోచిస్తున్నాం."

"వాడికి స్కాలర్‌షిప్ వస్తుందేమో కదా!"

"అక్కడికి వెళ్లాక గానీ తేలదు. ముందు మనం ఖర్చు చేయాల్సిందే!"

"కిరణ్‌కి తెలుసా?"

"ఆఁ. ఇది తెలిశాక వెళ్లనని ఒకటే గొడవ! మేమే బలవంతంగా ఒప్పించాం!" అంది లక్ష్మి.

"మీరు చేస్తున్న పని ఏం బాగాలేదు. వాడిని హింసిస్తున్నారు మధ్య!"

"వాడికి చిన్నతనం. ఇప్పుడేం తెలియదు. తర్వాత అక్కడ పెద్ద ఉద్యోగం వస్తే వాడే ఆనందపడతాడు."

లక్ష్మితో ఇక ఏం చెప్పినా వృథా అనుకుంది శారద.

"అయితే లక్ష్మీ! ఇప్పుడు డబ్బెలా దొరుకుతుంది?" డబ్బు దొరక్కపోతే వాడు వెళ్లనక్కర్లేదన్న ఆశతో అంది.

"ఇంటి మీద మూడు లక్షలు అప్పు తెస్తాం. ఇంకో లక్ష ఆయన ఎక్కడైనా అప్పు తెస్తారు. ఇక ఆపైన టిక్కెట్టుకు, ఇతర ఖర్చులకు మేం పొదుపు చేసిన డబ్బు సరిపోతుంది.

'ఇంటి మీద అప్పా!? ఎలా తీరుస్తారో? లక్ష్మికీ, ఆమె భర్తకీ రెక్కలే ఆధారం. ఎటువంటి ఆస్తిపాస్తులూ లేవు. స్వంత ఇల్లు కావాలనుకుని, ఎంతో పొదుపు చేసి చిన్న స్థలం కొనుక్కుని,

దానిలో నాలుగు గదుల ఇల్లు కట్టుకున్నారు. ఎంతో ముచ్చటపడి కట్టుకున్న ఇంటిపై అప్పు .... బయట ఇంకో అప్పు ... ఇద్దరూ సర్వీసు చివర్లో ఉన్నారు ... ఏ ధైర్యంతో వీళ్లు అప్పులు చేస్తున్నారు?'

"ఏమిటి ఆలోచిస్తున్నావు, శారదా?"

"అబ్బే ... ఏం లేదు, పాతిక ముప్పై వేలయితే నేనివ్వగలను!" అంది శారద.

"మా అవసరాలిప్పుడు లక్షల్లో!" నవ్వింది లక్ష్మి.

"ఇంత అప్పు చేసి కిరణ్‌ని అమెరికాకు పంపించకపోతే నేం, లక్ష్మీ?" అంది శారద.

"అమెరికాకు వెడితే వాడికి మంచి భవిష్యత్తు ఉంటుంది. బాగా డబ్బు సంపాదించవచ్చు. ఇక్కడేముంది? మేం ఎంత కష్టపడైనా సరే, వాడిని అమెరికాకు పంపించి తీరుతాం... సరేనా!" అంది లక్ష్మి దృఢంగా.

"సరే! ఇంతకీ వాడెప్పుడూ వెళ్లేది?" అనడిగింది శారద.

"వచ్చే నెల తొమ్మిదో తారీఖున. ఈ రోజుకు సరిగ్గా ఇరవై రోజులుంది. నేను మూడు వారాలు లీవు పెడుతున్నా. నా క్లాసు కూడా నువ్వే చూసుకోవాలి."

"అలాగే!" అంది శారద.

***

కిరణ్ అమెరికా వెళ్లి సంవత్సరం పైన అయింది.

"శారదా! నిన్న కిరణ్ ఫోన్ చేశాడు. శారదాంటీ ఇంతవరకూ ఒక్క ఉత్తరం వ్రాయలేదు... అన్నాడు, శారదా! ఉత్తరం రాయవచ్చు కదా!" అంది లక్ష్మి.

'ఏం రాయాలి? వెళ్లేటప్పుడు కళ్లనీళ్లతో నిండిన కిరణ్ ముఖమే తన కళ్లముందు కదలాడుతోంది. ఏం రాయాలి? ఎలా రాయాలి?' అనుకుంటూ, "రేపు రాస్తాలే!" అంది.

"శారదా! ఆయనకి ఒంట్లో బాగా ఉండటంలేదే! రేపు డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్లాలి."

"ఏమైంది?"

"ఏం తిన్నా అరగటంలేదు. వాంతి అయిపోతోంది. పాలు కూడా ఇమడడంలేదే!" అంది దిగులుగా లక్ష్మి.

"లక్ష్మి! బాధపడకు. ఏం కాదు, మంచి మందులు వాడితే తగ్గిపోతుందిలే!" ఓదార్చింది శారద.

కానీ లక్ష్మి భర్తకు అన్ని పరీక్షలూ చేసి లివర్‌లో అల్సర్ ఉందని నిర్ణయించారు డాక్టర్లు. సంవత్సరాల తరబడి హోటళ్లల్లో భోజనం చేయడం వలన లివర్ బాగా దెబ్బతిన్నది.

అది విని లక్ష్మి కంగారుపడింది.

హైదరాబాదు తీసుకెళ్లి టెస్ట్‌లు చేయించింది. డబ్బు నీళ్లలా ఖర్చయింది. డాక్టర్ల సలహా మీద ఉద్యోగం మానేశాడు. ప్రైవేటు స్కూల్ అవడంతో పెన్షన్ లేదు. ఇంటి మీద ఇంకా అప్పు తెచ్చారు.

అనుకోకుండా చుట్టుముట్టిన ఈ కష్టాలతో లక్ష్మి ఉక్కిరిబిక్కిరైపోయింది.

కిరణ్‌కి డబ్బు పంపి రెండు నెలలైంది. ఏం తింటున్నాడో, ఎలా ఉన్నాడో ...? అనుకుంటూ బాధపడింది లక్ష్మి.


"శారదా! ఇల్లు అమ్మేదామన్నా ... దానిమీది అప్పుకు సరిపోతుంది. వచ్చే నెల ఆయన్ని చెన్నై తీసుకెళ్లాలి. చేతిలో పైసా లేదు!" ఒకరోజున స్కూల్లో భోరున ఏడ్చింది లక్ష్మి.

'లక్ష్మి! ఇదంతా నువ్వు చేతులారా చేసుకున్నది. కిరణ్‌ని ఫారిన్‌కి పంపకుండా బెంగుళూరులో ఉద్యోగంలో చేరిస్తే నీ కీ కష్టాలు ఉండేవి కాదు కదా!' అని అనాలనుకుంది కానీ, అనుకోని కష్టాలతో బాధపడుతున్న లక్ష్మిని ఇంకా బాధించదలుచుకోలేదు.

"లక్ష్మి! ఈ కష్టాలనుండి బయటపడటానికి ఒకే ఉపాయం ఉంది!" అంది శారద.

లక్ష్మి తలెత్తింది.

"కిరణ్ అమెరికా నుండి తిరిగి రావడం!"




లక్ష్మి ముఖం వెలవెలబోయింది. "శారదా ...!"

శారద లక్ష్మి భుజంమీద చెయ్యి వేసింది. "లక్ష్మీ! నువ్వనుకున్నట్లు కిరణ్ అక్కడ యూనివర్సిటీలో చదువుకోవడంలేదు. మీ అప్పు తీర్చాలని ... మీ బాధలు తొలగించాలని అక్కడ మంచి ఉద్యోగంలో చేరాడు. అక్కడ అతని కాంట్రాక్టు పూర్తయిపోగానే ... అంటే మరో ఆరు నెలల్లో వచ్చేస్తాడు ... బాగా డబ్బు సంపాదించి కూడబెట్టాడు. ఇండియా వచ్చేసి మీ అప్పులు తీరుస్తాడు. ఆ తర్వాత ఇక్కడే ఉండి స్వంతంగా బిజినెస్ పెడతాడు. ఇదీ వాడి ఆలోచన ... మీకు తెలిస్తే తిడతారని చెప్పలేదు. లక్ష్మి! తల్లిదండ్రుల్ని బాధించే కొడుకుల్ని చూశాను గానీ, బాధ్యతగా వారినాదుకునే కొడుకుల్ని చూడలేదు. కిరణ్‌లాంటి కొడుకుని కన్న నువ్వు అదృష్టవంతురాలివి!" అంది శారద.

లక్ష్మికిదంతా అయోమయంగా ఉంది.

"శారదా! ఇదంతా నిజమేనా?"

"ముమ్మాటికీ నిజం! నాకీ విషయం ఈమధ్యనే చెప్పాడు. మీకు ఇప్పుడిప్పుడే చెప్పొద్దన్నాడు. మీరు బాధపడతారని వాడి భయం. లక్ష్మి! ఇంకా చదివి మిమ్మల్ని అప్పులపాలు చేయడం వాడికిష్టం లేదు. మిమ్మల్ని ఈ దశలో సుఖపెట్టాలనే వాడి తాపత్రయం. చూశావా, లక్ష్మి! నీ కొడుకెంత మంచివాడో! లక్ష్మి! మనిషి బతకడానికి కేవలం డబ్బే కాదు, గుప్పెడు ప్రేమ, పిడికెడు అనురాగం కావాలి! పిల్లల్లో మమతానుబంధాల చెలమని ఎండిపోనివ్వకు, దాహంతో మనిషి చచ్చిపోతాడు!" అంది ఆర్ద్రంగా.

లక్ష్మి ఆమెవైపు తెల్లబోయి చూడసాగింది.

శారద మాటల్లోని భావం అర్థం కావడానికి కొంత సమయం పట్టింది.

శారద చెప్పింది నిజం! ప్రస్తుత పరిస్థితుల్లో కిరణ్ తన దగ్గరుంటే బాగుండునని ఎన్నోసార్లు అనుకుంది. అందుకే ఇప్పుడు కిరణ్ త్వరలో వచ్చేస్తున్నాడనగానే బాధ కలగడంలేదు. గుండెలమీది భారం దింపినట్లయింది. కొండంత ధైర్యం కలుగుతోంది.

వలసపోయిన పక్షి గూటికి తిరిగొస్తోంది! ఇంతకంటే ఏం కావాలి? పాడైపోయిన గూడు నిలుస్తుంది. ఇక ఏ భయం లేదు ... ఆనందంతో లక్ష్మి మనస్సు ఉప్పొంగిపోతోంది.

శారద రెండు చేతులూ పట్టుకుని, "శారదా! ఎంత శుభవార్త చెప్పావు!? నాకెంత సంతోషంగా ఉందో తెలుసా...!" అంది చిన్నపిల్లలా సంతోషపడుతూ.

తన చేతులు పట్టుకుని గట్టిగా ఊపేస్తున్న లక్ష్మివైపు ఆప్యాయంగా చూసింది శారద. ■